ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -118 పేజీలు - 8 వెల - 03/- శనివారం 15 ఆగస్టు 2026

## పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా



### జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నేడు 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం
- 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు
- ఉగ్రవాదులకు 'ఆపరేషన్ సిందూర్' గట్టి సందేశం పంపిందన్న ముర్ము
- పరీక్షల విధానంలో పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ
- గడిచిన పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడి
- దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చరిత్రాత్మక విజయమన్న రాష్ట్రపతి

2లో.

## మొదటి ప్రాధాన్యత తాగునీటికి

### డేటా సెంటర్లకు నీటి సరఫరాపై అది దుష్ప్రచారం మాత్రమే: సీఎం చంద్రబాబు

- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చంద్రబాబు ఆదేశం
- లోటు వర్షపాతం దృష్ట్యా నీటిని పొదుపుగా వాడాలని అధికారులకు స్పష్టం
- పోలవరం, వెలిగొండ సహా 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని సూచన
- అన్నమయ్య ప్రాజెక్టు ఆయకట్టుకు నీరిచ్చే అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం

**అమరావతి, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్లకు భారీగా నీటిని కేటాయిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. అది కేవలం దుష్ప్రచారమేనని, డేటా సెంటర్ల పూర్తిస్థాయి అవసరాలకు కేవలం 3.5 టీఎంసీల నీరు మాత్రమే సరిపోతుందని స్పష్టం చేశారు. ఈ వాస్తవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అపోహలను తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం పరిస్థితుల దృష్ట్యా, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో



తాగునీటి అవసరాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. నేడు సచివాలయంలో జలవనరుల శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. **మిగతా 2లో...**

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని

2లో.



## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

### నల్సార్ ఘటనపై బిసిఐ జోక్యం సరికాదు

### సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. నల్సార్ నుంచి 2026లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఆదేశించారు. అది తనకు, విద్యార్థులకు మధ్య సమస్య అని, బీసీఐ జోక్యం ఎందుకు చేసుకుందని అసహనం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి **మిగతా 2లో...**



## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

- మూడు దశల ఆధునీకరణ ప్రణాళికలో భాగంగా రెండో విడతలో ఈ వాహనాల కొనుగోలు
- ప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యం

**అమరావతి, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాజధాని అమరావతిలోని సీడ్ **మిగతా 2లో...**

## సోషల్ మీడియా పోస్టులపైజాగ్రత్త

### అతిగా అనవసర విషయాలపై జోక్యం తగదు

### పార్టీ శ్రేణులకు పవన్ కళ్యాణ్ హితవు

**అమరావతి, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** సోషల్‌మీడియాలో విభిన్నమైన అంశాలపై మాట్లాడే సమయంలో, పోస్టులు పెట్టేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమ పార్టీ శ్రేణులకు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశర చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం భాషను ఉపయోగించడం మంచిది కాదన్నారు. ప్రసార మాధ్యమాలు, సోషల్‌మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నేతలు, జన సైనికులు, వీర మహిళలు కచ్చితంగా**మిగతా 2లో...**



## సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

- రాహుల్ గాంధీకి భారీ ఊరట..
- క్రిమినల్ కేసు, దిగువ కోర్టు సమన్లు రద్దు
- యూపీ ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని గుర్తించిన సుప్రీం
- 2022 భారత్ జోడో యాత్రలో రాహుల్ వ్యాఖ్యలు
- 153ఏ, 505 సెక్షన్ల కింద దిగువ కోర్టు సమన్లు



2లో.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

## తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలకు ఆమోదం

- డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
- ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సమ్మిట్‌కు ప్లాన్
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు
- ఘనంగా నేటి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూర్ పరిధిలో ఆటోలను ఇవిలుగా మార్చేందుకు పథకం
- స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు
- ఏడు రకాల సన్నాల సాగుకు ప్రోత్సాహం..ప్రచారం
- కొడంగల్ ఎత్తిపోతలకు రూ. 2,100 కోట్ల అంచనా



**హైదరాబాద్,ఆగస్టు14(ఆర్ఎన్ఎ):** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాబోయే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్‌ను గతేడాది కంటే మరింత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి ప్రత్యేకంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' అనే థీమ్‌తో ఈ సమ్మిట్‌ను ప్లాన్ చేస్తున్నారు. అంతేకాకుండా, తెలంగాణలో ఇప్పటివరకు **మిగతా 2లో...**



## నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలన్న నిమ్మల
- ఏపీ అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లామని వెల్లడి
- నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు వ్యవహరించాలన్న నిమ్మల

**అమరావతి, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ శ్రీశైలం నీటిని వినియోగించుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమస్యలను పరిష్కరించుకోవడానికి**మిగతా 2లో...**

## సోషల్ మీడియా పోస్టులపైజాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

పార్టీ నిర్దేశిరచిన మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లొద్దు. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకు అనుగుణంగానే స్పందించాలి. ఏదైనా విషయంపై మాట్లాడే సమయంలో ఆవేశాలకు గురికావొద్దు. అసభ్య పదజాలాన్ని వాడొద్దు. మహిళలను గౌరవించి మాట్లాడండి. పార్టీ అంతర్గత విషయాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడొద్దు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని ఉపేక్షించం. పార్టీ క్రమశిక్షణకు విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోనవ్వొద్దు. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో చిక్కుకోవద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి. పార్టీ అభ్యున్నతి, కష్టపడి పనిచేసే వారి సంక్షేమం పార్టీ దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి' అని పవన్ పిలుపునిచ్చారు.

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

**న్యూఢిల్లీ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.

అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

## నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది

మొదటిపేజీ తరువాయి

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వారిపై బీసీఐ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంతవరకూ నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు గురువారం లేఖ రాశారు. ఆ ఉత్తర్వులపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (÷ాఅఃం) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్పందిస్తూ.. 'రాజ్యాంగబద్ధమైన సంస్థతో విభేదించిన ఒక్కకారణంతో.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించే హక్కును నిరాకరిస్తామని విద్యార్థులను బెదిరించకూడదు' అని వ్యాఖ్యానించారు. బీసీఐ స్పందించిన తీరును సీజేఐ సీరియస్‌గా తీసుకున్నారు.

'ఇదంతా పూర్తిగా అనవసరమైన ప్రక్రియ. నేను విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొనేవాడిని. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరిగిన విషయం. జోక్యం చేసుకోవడానికి వా÷-లెవరు..?' అని సీజేఐ ఒకింత ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీఐ ఇచ్చిన సర్క్యులర్లపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు, అధ్యాపకులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించింది. ఈ నేపథ్యంలో బీసీఐ ఇప్పటికే తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

## సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టేసిన సుప్రీం

### రాహుల్ గాంధీకి భారీ ఊరట..

**ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**

సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది.

జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది.

2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై న్యాయవాది నృపేంద్ర పాండే దిగువ కోర్టును ఆశ్రయించారు. రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కలిగించడంతో పాటు వర్గాల మధ్య విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీంతో దిగువ కోర్టు ప్రాథమికంగా కేసు విచారణకు అర్హమైనదేనని భావించింది. భారతీయ శిక్షాస్మృతిలోని 153ఏ, 505 సెక్షన్ల కింద రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే సుప్రీంకోర్టు విచారణలో కీలక లోపం బయటపడింది. ఈ సెక్షన్ల కింద కేసు కొనసాగించేందుకు అవసరమైన ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అనుమతి తీసుకోలేదని తేలింది. దీంతో ఆ లోపాన్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు మొత్తం క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసింది.

## నిబంధనల ప్రకారమే శ్రీశైలం నీటి వినియోగం

మొదటిపేజీ తరువాయి

గోదావరి నదీ యాజమాన్య బోర్డు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (ఖ=వీదీ) సమావేశాలు ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య 66:34 నిష్పత్తిలోనే నీటి పంపకాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి ఉన్న అభ్యంతరాలను ఇప్పటికే జీఆర్ఎమ్‌బీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. జీఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రెండు రాష్ట్రాలు పరస్పరం వ్యవహరించాలని సూచించారు.

ఇదే క్రమంలో గోదావరి – కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టుపై కూడా ఆయన మాట్లాడారు. ఈ అనుసంధానానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు.

## ప్రతిష్టాత్మక 'ఇండియన్ పోలీస్ మెడల్'కు సయ్యద్ మహబూబ్ బాషా ఎంపిక



**అమరావతి, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** రెండు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో విశిష్ట, ప్రశంసనీయమైన సేవలు అందించిన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ అసిస్టెంట్ కమాండెంట్ (డీఎస్పీ ర్యాంక్) సయ్యద్ మహబూబ్ బాషాను భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'ఇండియన్ పోలీస్ మెడల్' కు ఎంపిక చేసింది. విధి నిర్వహణ పట్ల అసాధారణమైన అంకితభావం, నిబద్ధత, నిష్కళంకమైన నిజాయితీ ఇంకా ఆదర్శప్రాయమైన వృత్తి నైపుణ్యాన్ని కనపరించినందుకు అత్యున్నతమైన జాతీయ 'ఇండియన్ పోలీస్ మెడల్' పురస్కారంతో సత్కరించనున్నారు. సయ్యద్ మహబూబ్ బాషా 1998లో పోలీసు శాఖలో చేరి, ప్రజారక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ , సంస్థాగత శ్రేష్ఠతకు అంకితమై విశేష సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీలో అసిస్టెంట్ కమాండెంట్ / డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, పోలీసు అధికారుల శిక్షణ, పరిపాలనా వ్యవహారాలలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# పరీక్షల సంస్కరణలతో యువతకు భరోసా

### జాతిని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. గడిచిన దశాబ్దంలో ప్రపంచ అనిశ్చితుల మధ్య కూడా దేశం వేగవంతమైన, సమ్మిళిత వృద్ధిని సాధించిందని కొనియాడారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న కఠిన వైఖరిని, అంతర్గత భద్రతలో సాధించిన విజయాలను, ఆర్థిక ప్రగతిని ఆమె తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు.

**ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు**

ఉగ్రవాదులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న దేశాలపై భారత్ తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను రాష్ట్రపతి ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్', సింధు జలాల ఒప్పందం నిలిపివేత వంటివి చరిత్రాత్మక నిర్ణయాలని అభివర్ణించారు. "ఆపరేషన్ సిందూర్ మన సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనం. ఉగ్రవాదంపై భారత సైన్యం ఎంత కచ్చితత్వంతోనైనా చర్యలు తీసుకోగలదని ఈ ఆపరేషన్ నిరూపించింది. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారి చర్యల పర్యవసానాలను ఎదుర్కోక తప్పదని ఇది గట్టి సందేశం పంపింది" అని ఆమె స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం దేశ ప్రయోజనాల రీత్యా, ముఖ్యంగా రైతుల శ్రేయస్సు దృష్ట్యా తీసుకున్న కీలకమైన ముందడుగు అని తెలిపారు.



**అభివృద్ధి, సంక్షేమంలో దేశం ముందంజ**

గడిచిన పదేళ్లలో దేశం "వికాస్, విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) రెండింటినీ సమన్వయం చేసుకుంటూ వేగంగా పురోగమించిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన' కింద దాదాపు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు ఆకర్షించడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని ఆమె పేర్కొన్నారు.

**యువశక్తికి, మహిళా సాధికారతకు పెద్దపీట**

ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి పారదర్శకతను పాటిస్తామని ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. దేశ జనాభాలో 65 శాతం ఉన్న 35 ఏళ్లలోపు యువతే స్టార్టప్ వ్యవస్థకు చోదక శక్తిగా నిలుస్తోందని, దేశ ఉజ్వల భవిష్యత్తుకు వారే సారథులని కొనియాడారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలపడుతున్నాయని అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

**అంతర్గత భద్రత, సామాజిక పురోగతి**

దేశంలో మావోయిజం అంతం కావడం ఒక చారిత్రాత్మక విజయమని రాష్ట్రపతి అభివర్ణించారు. ఒకప్పుడు మావోయిజంప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధి జరుగుతోందని, ఇటీవల బస్తర్‌లో జరిగిన 'బస్తర్ ఒలింపిక్స్' ఇందుకు నిదర్శనమని చెప్పారు. 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా దేశంలో క్రీడా పర్యావరణ వ్యవస్థ బలోపేతమై, అంతర్జాతీయ పోటీలలో మన క్రీడాకారుల ప్రదర్శన గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రజా భాగస్వామ్యం (జన్ భాగీదారీ) అనేది మన దేశ సంప్రదాయమని, పౌరుల భాగస్వామ్యంతోనే జాతీయ సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్తోందని తెలిపారు. ఈ సందర్భంగా దేశ విభజన నాటి భయానక పరిస్థితులను గుర్తుచేసుకుంటూ, 500కు పైగా సంస్థానాలను ఏకం చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె నొక్కిచెప్పారు. ప్రసంగం ప్రారంభానికి ముందు, పార్సీ నూతన సంవత్సరం 'నవ్రోజ్' సందర్భంగా దేశ విదేశాల్లోని పార్సీ సోదర సోదరీమణులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

# మొదటి ప్రాధాన్యత తాగునీటికి

మొదటిపేజీ తరువాయి

వాటర్ మూవ్‌మెంట్ ప్లాన్‌కు అనుగుణంగానే నీటి నిర్వహణ చేపట్టాలని, రిజర్వాయర్లు, చెరువుల్లోని నీటి నిల్వలతో పాటు భూగర్భ జలాలను అత్యంత సమర్థంగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పోలవరం ప్రాజెక్టులో ఇప్పటివరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇటీవల గోదావరికి 14 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ స్థానికుల మనోభావాలను గౌరవించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి విశాఖపట్నం వరకు ఎడమ కాలువ పనులను పూర్తి చేయాలని గడువు విధించారు. పోలవరం కుడి, ఎడమ కాలువలకు మంచి పేర్లను సూచించాలని కోరారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు పెంచేందుకు 'జలధార–జలహారతి' కార్యక్రమాలను కొనసాగించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతగా గుర్తించిన 36 ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆదేశించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు, నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా, అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న ఆయకట్టుకు నీరందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్), వివిధ ప్రాజెక్టుల సీఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు..

యాక్సెస్ రోడ్డులో శుక్రవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సమర్థవంతంగా స్పందించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టారు.

కొత్తగా సమకూర్చిన ఈ వాహనాల్లో గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో సేవలు అందించేందుకు 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు. అగ్నిమాపక శాఖను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం మొత్తం మూడు దశల్లో రూ.252.86 కోట్లతో ప్రణాళికను అమలు చేస్తోంది. తొలి దశలో భాగంగా ఇప్పటికే రూ.33 కోట్లతో 65 వాహనాలను అందుబాటులోకి తీసుకురాగా, తాజా ప్రారంభోత్సవం రెండో దశకు చెందింది. మూడో దశలో మరిన్ని వాహనాలతో పాటు అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయనున్నారు. వాహనాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 కొత్త ఫైర్ స్టేషన్ల నిర్మాణం, 36 పాత స్టేషన్ల ఆధునికీకరణ పనులు కూడా జరుగుతున్నాయి.

ఈ కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వాహనాల పనితీరు, ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రమాదాలకు త్వరితగతిన స్పందించి, ప్రాణ, ఆస్తినష్టాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ ఆధునికీకరణ చేపట్టినట్లు వారు తెలిపారు.

# గ్లోబల్ సమ్మిట్ 2.0

మొదటిపేజీ తరువాయి

స్టార్టప్‌లు సాధించిన విజయాలు, సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పేలా సమ్మిట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం తీర్మానించింది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముగిసింది. ఈ కేబినెట్ భేటీలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలసి మీడియాకు వివరించారు. ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# మట్కా స్థావరాలపై పోలీసుల నిఘా

## రూ.22,350 నగదు.. ఏడు మట్కా చీటీలు స్వాధీనం

**గుత్తి, ఆగస్టు 14: (రిపబ్లిక్ న్యూస్)**



పట్టణంలో మట్కా రాస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి రూ. 22,350 నగదు, ఏడు మట్కా చీటీలు, ఒక బాల్‌పెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో చోటుచేసుకుంది. గుత్తి సీఐ రామారావు సమీక్షలో భాగంగా ఎస్సై అమీర్ ఖాన్ తమ సిబ్బందితో కలిసి శుక్రవారం చెర్లోపల్లి కాలనీలోని బ్రహ్మయ్యగుడి వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మట్కా రాస్తున్న షేక్ అన్వర్‌భాషా ను పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న రూ. 22,350 నగదు, ఏడు మట్కా చీటీలు, ఒక బాల్‌పెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలో మట్కా, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. గుత్తి పట్టణ పరిధిలో మట్కా, గంజాయి, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే గుత్తి పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై ప్రజలను కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా

**గుత్తి, ఆగస్టు 14: (రిపబ్లిక్ న్యూస్)**




గుత్తి పట్టణంలో శుక్రవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశభక్తిని చాటుతూ జాతీయ జెండాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి. జబ్బర్ మియా మాట్లాడుతూ.. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేందుకు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా పట్ల గౌరవభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే ఆదేశాలతో ఇంటింటికీ టీడీపీ నేతలు

## .. ప్రజా సమస్యలపై ఆరా





**ఎమ్మిగనూరు, ఆగష్టు, 14,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్సీ కాలనీలో 143వ బూత్ పరిధిలో టీడీపీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. 8వ వార్డు యూనిటీ ఇన్‌చార్జ్ కదిరి కోట షాలేము రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఎంబీ మహేష్, క్లస్టర్-10 దాదాసాహెబ్, ఎం.ఏ. షేపు, కే. శాంతరాజు, ఎం. సామ్సన్, ఎం. కిరణ్, కే. సురేష్, రాజేష్, ఫ్రాన్సిస్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

## పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి

**గుత్తి, ఆగస్టు 14:( రిపబ్లిక్ న్యూస్)**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంతకల్లు నియోజకవర్గం గుత్తి మండల ప్రజలకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. దేశ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గుత్తి మండల ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరస్పర సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, సౌభాగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు జన్మదిన వేడుకలు

## ఇల్లూరు అయాన్‌కు కుటుంబ సభ్యుల ఆశీస్సులు

**ఆసిఫాబాద్, ఆగస్టు 14: (రిపబ్లిక్ న్యూస్)**




ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం మానిక్ గూడ గ్రామానికి చెందిన ఇల్లూరు అయాన్ నేడు జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అత్తమామలు, పిన్ని, బాబాయిలు, నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు అయాన్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అయాన్ భవిష్యత్తు సంతోషంగా, విజయవంతంగా సాగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# సోలార్ కంపెనీల మోసాలపై రైతు సంఘం ఆగ్రహం

## ఏపీ రైతు సంఘం భారీ ప్రదర్శన

## రైతుల భూములను కాపాడాలని డిమాండ్




**గుత్తి, ఆగస్టు 14: (రిపబ్లిక్ న్యూస్ )**
సోలార్ కంపెనీల మోసపూరిత ఒప్పందాల నుంచి రైతులను కాపాడాలని, రైతుల భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గుత్తి పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సోలార్ బాధిత రైతుల రాష్ట్ర సదస్సులో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

గుత్తిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ప్రదర్శన గాంధీ కూడలి మీదుగా నిజామి ఫంక్షన్ హాలు వరకు సాగింది. ఈ సందర్భంగా నాయకులు, రైతులు సోలార్ కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. రైతుల భూములను వివిధ రకాల ఒప్పందాల పేరుతో కంపెనీలు తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని వారు ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. సోలార్ ప్రాజెక్టుల కోసం భూములు తీసుకునే విషయంలో రైతులకు పూర్తి సమాచారం అందించాలని, మోసపూరిత ఒప్పందాలను అడ్డుకోవాలని కోరారు. రైతుల భూములకు రక్షణ కల్పించడంతో పాటు వారి హక్కులను కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రదర్శనలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య పాల్గొన్నారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు కె. చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణహరి, పెద్దన్న, రామకృష్ణుడు, రాజశేఖర్, దస్తగిరి, గోపాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ నాయకులు పి. హనుమంతు, సుబ్బరాయుడు, రాజారామిరెడ్డి, శివారెడ్డి, విరూపాక్షి, సీఐటీయూ అనంతపురం జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. కృష్ణమూర్తి, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు ప్రజాసంఘాల నాయకులు వి. నిర్మల, ఎన్. రేణుక, ఎం. మల్లేష్, దస్తగిరి, సి. రమేష్, యు. మల్లికార్జున, మద్దిలేటి, రేవతి, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూముల విషయంలో కంపెనీల ఒత్తిళ్లకు తావివ్వకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, భూముల రక్షణకు స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు.

# రైతులు పంట నమోదు అనంతరం ఈ కేవైసీ చేసుకోవాలి

## వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్



**చిప్పగిరి, ఆగస్టు, 14, (రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక వ్యవసాయ కార్యాలయం నందు వ్యవసాయ అధికారి శ్రీరామ్ ప్రవీణ్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు తమ పొలంలో ఏ పంట సాగు చేస్తున్నారో, ఆ పంటకు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి. పంట నమోదును సంబంధిత సిబ్బంది ద్వారా గానీ, రైతులు స్వయంగా సంబంధిత యాప్ ద్వారా గానీ చేసుకోవచ్చు అని పంటనమోదు చేయించుకోవడంతో పాటు రైతు ఈ-కేవైసీ కూడా తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలి. పంట నమోదు ఉండటం, భూమిలో వాస్తవంగా పంట సాగులో ఉండటం, అలాగే అవసరమైన ఈ-కేవైసీ పూర్తి చేయడం వంటి అంశాలు భవిష్యత్తులో పంట బీమా మరియు ప్రభుత్వం అందించే ఇతర పథకాల ప్రయోజనాలు పొందవచ్చు అని, కాబట్టి రైతులందరూ తప్పనిసరిగా ఈ మూడు విషయాలను పాటించాలి:

పంట సాగు చేయాలి, సాగు చేసిన పంటను పంట నమోదులో నమోదు చేయించుకోవాలి, పంట నమోదు అనంతరం ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలి అని,

అదేవిధంగా ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు మరియు ఇతర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతులు సాధ్యమైనంత వరకు తక్కువ కాలవ్యవధి గల స్వల్పకాలిక పంటలు మరియు విత్తనాలను ఎంచుకోవాలని, జొన్నలు, సజ్జలు, రాగులు, క్లస్టర్ బీన్, ఇతర అనుకూలమైన ఆకుకూరలు మరియు తక్కువ కాలవ్యవధిలో పూర్తయ్యే పంటలను సాగు చేసుకోవడం ద్వారా భూమిని ఖాళీగా ఉంచకుండా, పంటతో కప్పి ఉంచాలని, కాబట్టి చిప్పగిరి



మండలంలోని రైతులందరూ పై సూచనలను తప్పకుండా పాటించి, తమ పంటను నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ పూర్తి చేసుకుని, ప్రభుత్వం అందించే అర్హత కలిగిన ప్రయోజనాలను పొందాలని వ్యవసాయాధికారి శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు, అనంతరం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం సందర్భంగా కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేద్దాం

## దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 14)**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి పెద్దపాడు రస్తాలోని సన్‌రైస్ హోమ్స్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, ప్రజలకు జాతీయ త్రివర్ణ పతాకాలను ఉచితంగా పంపిణీ చేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశం పట్ల గౌరవం, బాధ్యతను ప్రతి ఒక్కరూ చాటాలని కోరారు. ప్రతి కుటుంబం తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ ఐక్యతను, దేశభక్తిని ప్రతిబింబించాలని సూచించారు. ప్రతి ఇంటా జాతీయ జెండా రెపరెపలాడేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలంతా ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. జాతీయ జెండా దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని కమిషనర్ పేర్కొన్నారు. త్రివర్ణ పతాకం ప్రతి ఇంటిపై రెపరెపలాడేలా ప్రజలు తమ వంతు బాధ్యతగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

అదేవిధంగా స్వచ్ఛమైన, పచ్చని కర్నూలు నగర నిర్మాణంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు 70 వేల మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడి భవిష్యత్ తరాలకు పచ్చని నగరాన్ని అందించాలని పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం ఒక వేడుకగా కాకుండా దేశం పట్ల మన బాధ్యతను గుర్తుచేసే రోజుగా ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, ఎస్‌ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ కృష్ణలత, ఏఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

# హయాటస్ హెర్నియాకు విజయవంతంగా ఫండోప్లికేషన్ శస్త్రచికిత్స

## కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అరుదైన శస్త్రచికిత్స.. - వైద్య బృందాన్ని అభినందించిన సూపరింటెండెంట్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 14)**
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అరుదైన, క్లిష్టమైన హయాటస్ హెర్నియా కేసుకు విజయవంతంగా ఫండోప్లికేషన్ శస్త్రచికిత్స నిర్వహించారు. ఆసుపత్రి జనరల్ సర్జరీ విభాగంలో 60 ఏళ్ల తిరుపాల్ నాయక్ కడుపు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం చేరారు. వైద్య పరీక్షలు, ఎండోస్కోపీ నిర్వహించిన అనంతరం ఆయనకు గ్రేడ్-3 హయాటస్ హెర్నియా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు.



రోగికి వైద్య బృందం విజయవంతంగా ఫండోప్లికేషన్ శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ ప్రక్రియలో హయాటల్ ప్రాంతాన్ని సరిచేయడంతో పాటు ఆహారనాళంకడుపు మధ్య భాగాన్ని బలోపేతం చేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందించడంతో క్రమంగా కోలుకుంటున్నారు.

ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను ప్రొఫెసర్ డా. రామకృష్ణ నాయక్ నేతృత్వంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. ప్రణీత్, డా. ప్రశాంతి విజయవంతంగా నిర్వహించారు. పీజీ విద్యార్థులు డా. మనోజ్ రెడ్డి, డా. సోమశేఖర్, డా. తేజేశ్వర్, డా. ఆంచల్ శస్త్రచికిత్సలో కీలకంగా సహకరించారు.

అనస్థీషియా విభాగం హెచ్‌ఓడీ డా. సుధీర్ నేతృత్వంలో ప్రొఫెసర్ డా. రాంశివ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డా. రాణి మంజుష, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. సుధీర్ గౌడ్, డా. ఫియాజుద్దీన్ సమర్థవంతమైన అనస్థీషియా సేవలు అందించారు. వారి సమన్వయంతో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది.

ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు శస్త్రచికిత్స బృందాన్ని, పీజీ విద్యార్థులను, అనస్థీషియా బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. నిపుణులైన వైద్యులు, పీజీ విద్యార్థులు, అనస్థీషియా సిబ్బంది సమన్వయంతో ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# పొలం మధ్యలో టవర్..

# రైతు కుటుంబం కన్నీరు

**హైవే పక్కనున్న విలువైన భూమికి భారీ డిమాండ్**
**రూ.9 లక్షల పరిహారంతో జీవనోపాధి సాధ్యమా**
**టవర్ ఒక వైపు ఏర్పాటు చేయాలని రైతుల వేడుకోలు**
**ఒత్తిళ్లకు గురి చేస్తే ఆత్మహత్యే శరణ్యం**
**కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి**








**శింగనమల /కొర్రపాడు, ఆగస్టు 14,(రిపబ్లిక్ న్యూస్):** వ్యవసాయ భూమిలో ఓ రైతు కుటుంబం జీవనోపాధి పొందుతోంది.ఆ పంట పొలం మధ్యలో టవర్ నిర్మాణం చేపడితే మా కుటుంబం పరిస్థితి ఏంటి అంటూ ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. హైవే సమీపంలోని తమ వ్యవసాయ భూమి మధ్యలో హైటెన్షన్ విద్యుత్ లైన్, టవర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. విలువైన పంట భూమిలో టవర్ నిర్మిస్తే సాగుకు ఇబ్బందులు ఏర్పడటంతోపాటు భవిష్యత్తులో భూమి విలువ తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు.

**7.5 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కోసం టవర్లు ఏర్పాటు**

కొర్రపాడు గ్రామ పరిధిలోని చ గ్రామ రెవెన్యూ పొలంలో సర్వే నంబర్లు 141, 142లో మొత్తం 5.40 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆర్.నరసింహారెడ్డికి సుమారు 2.30 ఎకరాల వాటా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైవేకు ఆనుకుని ఉన్న ఈ భూమిలో సాగు పంటలపైనే కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రస్తుతం 7.5 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కోసం టవర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో తమకు నష్టం కలుగుతుందని రైతులు చెబుతున్నారు.భూమికి ఒక వైపు నుంచి విద్యుత్ లైన్ తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ పొలం మధ్యలోనే టవర్ ఏర్పాటు చేయడం వల్ల భూమి వినియోగానికి ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టవర్‌ను ఒక వైపున ఏర్పాటు చేస్తే కొంత నష్టం వచ్చినా భరిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**టవర్ ఏర్పాటు చేస్తే విక్రయించడం ఇబ్బందికరం**

టవర్ ఏర్పాటుకు రూ.9 లక్షల వరకు పరిహారం ఇస్తామని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. అయితే ఒక్కసారి ఇచ్చే పరిహారంతో తమకు శాశ్వతంగా కలిగే నష్టాన్ని ఎలా పూడ్చగలరని ప్రశ్నిస్తున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే పొలానికి దారి కోసం తమ భూమిలో స్థలం తీసుకున్నప్పుడు ఒక్క సెంటుకు రూ.2.20 లక్షల చొప్పున చెల్లించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.హైవే పక్కన ఉన్న భూమికి ప్రస్తుతం విలువ ఎక్కువగా ఉందని.. పొలం మధ్యలో టవర్ ఏర్పాటు చేస్తే సాగుతోపాటు భవిష్యత్తులో భూమిని వినియోగించడం, విక్రయించడం కూడా ఇబ్బందికరంగా మారుతుందని చెబుతున్నారు.

**చదువులు.. వైద్య ఖర్చులన్నీ భూమిపైనే..**

నరసింహారెడ్డి కుటుంబానికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని, పిల్లల చదువులు, కుటుంబ పోషణ మొత్తం వ్యవసాయ ఆదాయంపైనే ఆధారపడి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. మరో కుటుంబానికి ఐదుగురు కుమార్తెలు ఉండగా.. ఇద్దరికి వివాహాలు జరిగాయని, ఇద్దరు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. తాము వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు.

**రైతులపై సంస్థ ప్రతినిధులు, పోలీసుల ఒత్తిడి**

బాధిత కుటుంబ యజమానికి గతంలో విద్యుత్ ప్రమాదం జరిగి ఎడమచేతి భుజానికి తీవ్ర గాయమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం గుండెపోటు రావడంతో స్టంట్ వేయించుకున్నారని చెప్పారు. వైద్య ఖర్చులు, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు అన్నీ వ్యవసాయ భూమి ఆదాయంపైనే ఆధారపడి ఉన్నాయని వివరించారు.

ఒత్తిళ్లకు గురిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటుతో తమకు కలిగే నష్టాన్ని వివరిస్తున్నప్పటికీ సంస్థ ప్రతినిధులు, కొందరు పోలీసుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారని రైతులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురవుతున్నారని, సమస్యను పరిష్కరించాల్సింది పోయి ఒత్తిళ్లకు గురిచేయడం సరికాదన్నారు.ప్రభుత్వ అధికారులు, సంస్థ ప్రతినిధులు రైతులతో నేరుగా చర్చించి, భూమికి కనీస నష్టం కలిగేలా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ప్రాజెక్టు పనులకు తాము వ్యతిరేకం కాదని.. తమ భూమి మధ్యలో కాకుండా ఒక వైపు నుంచి విద్యుత్ లైన్ తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంస్థ ప్రతినిధులు పోలీసులు పదేపదే ఇళ్ల దగ్గరకొచ్చి ఒత్తిళ్లకు గురి చేస్తున్నారు. ఒత్తిళ్లు ఇలాగే కొనసాగితే తమకు ఆత్మహత్య శరణం అంటూ ఆవేదన చెందారు.

**జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి**

రైతుల సమస్యపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. హైవే పక్కనున్న విలువైన వ్యవసాయ భూమిలో టవర్ ఏర్పాటు వల్ల కలిగే నష్టం, భూమి వినియోగంపై ప్రభావం, పరిహారం అంశాలను సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. టవర్‌ను పొలం మధ్యలో కాకుండా ఒక వైపు ఏర్పాటు చేసి భూమిని, తమ కుటుంబ భవిష్యత్తును కాపాడాలి అని రైతు కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

# రైతుల సమస్యలకు సెరెంటికా హెల్ప్‌లైన్

**ప్రతినిధులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్**




**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14,(రిపబ్లిక్ న్యూస్):** గాలిమరలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూములు, పరిహారం, రాకపోకలు, నిర్మాణ పనులకు సంబంధించిన సందేహాలను నేరుగా కంపెనీ దృష్టికి తీసుకెళ్లేందుకు సెరెంటికా సంస్థ ప్రత్యేక ఫార్మర్స్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా 18003097701 నంబర్‌కు ఫోన్ చేసి రైతులు తమ సమస్యలు, సందేహాలను నేరుగా సంస్థ ప్రతినిధులకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సెరెంటికా ఫార్మర్స్ హెల్ప్‌లైన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

**ఎలాంటి మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల నేపథ్యంలో రైతులు, కంపెనీల మధ్య సమాచార లోపం లేకుండా పారదర్శకత, నమ్మకాన్ని పెంపొందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతులు పలు సందర్భాల్లో తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో సెరెంటికా కంపెనీ ప్రతినిధులతో చర్చించామని, అందుకు స్పందించిన సంస్థ వెంటనే ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల రైతులు ఎలాంటి మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడే అవకాశం లభిస్తుందని తెలిపారు. భూమి పరిహారం, నష్టపరిహారం చెల్లింపులు, భూమికి సంబంధించిన అంశాలు, ప్రాజెక్టు నిర్మాణ పనుల సమయాలు, పొలాల్లో రాకపోకలు, విండ్ టర్బైన్లు, సౌర ప్యానెళ్ల వద్ద భద్రతా చర్యలు తదితర అంశాలపై రైతులు హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం పొందవచ్చన్నారు.

**ప్రాజెక్టు సంస్థలకు మధ్య జవాబుదారీతనం ఉండాలి**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రాజెక్టులకు సంబంధించి ఎదురయ్యే ఇతర సమస్యలను కూడా సంస్థ దృష్టికి తీసుకెళ్లవచ్చని చెప్పారు. రైతులకు, విద్యుత్ ప్రాజెక్టు సంస్థలకు మధ్య స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలని, సెరెంటికా తరహాలో ఇతర పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు సంస్థలు కూడా ప్రత్యేక హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల సమస్యలకు నేరుగా స్పందించే వ్యవస్థ ఉండటం వల్ల కంపెనీలపై నమ్మకం పెరగడంతోపాటు ప్రాజెక్టుల నిర్వహణలో పారదర్శకత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెరెంటికా కంపెనీ ప్రతినిధులు తేజల ఆనంద్, రామదుర్గ అనిల్‌కుమార్‌తోపాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

**ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి -మాసవారీ శాఖల సమీక్ష సమావేశం నిర్వహణ**






**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 14,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో మొండి బకాయిల (ఎన్‌పీఏ)ను తగ్గించడంతోపాటు వ్యాపారాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సూచించారు. డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో కేశవరెడ్డి అధ్యక్షతన మాసవారీ శాఖల మేనేజర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు.

**నాణ్యమైన సేవలందిస్తూ...**
**బ్యాంకు డిపాజిట్లను పెంచుకోవాలి**

ఈ సందర్భంగా బ్యాంకు పనితీరు, రికవరీ, డిపాజిట్ల పెంపు, వ్యాపారాభివృద్ధిపై సమీక్షించారు. మొండి బకాయిలను వేగంగా వసూలు చేసి ఎన్‌పీఏను తగ్గించేందుకు శాఖల మేనేజర్లు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని కేశవరెడ్డి సూచించారు. రైతులు, ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ బ్యాంకు డిపాజిట్లను పెంచుకోవాలని, తద్వారా వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

**మేనేజర్లను ఆదర్శంగా తీసుకుని బ్యాంకు పురోగతికి కృషి**

బ్యాంకు పురోగతికి విశేషంగా కృషిచేస్తూ వ్యాపారాభివృద్ధి, రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం రోడ్ బ్రాంచ్ మేనేజర్ సునీత, పామిడి బ్రాంచ్ మేనేజర్ మంజుల, తాడిపత్రి బ్రాంచ్ మేనేజర్ ఉమారాణిలను చైర్మన్ కేశవరెడ్డి సన్మానించి అభినందించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని మిగిలిన శాఖల మేనేజర్లు ఆదర్శంగా తీసుకుని బ్యాంకు పురోగతికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సహకార వ్యవస్థ ద్వారా రైతులు, ఖాతాదారులకు బ్యాంకు నిరంతరం అండగా ఉంటుందని అధికారులు తెలిపారు. సమావేశంలో బ్యాంకు సీఈఓ విజయ్‌కుమార్, జనరల్ మేనేజర్లు విజయ్‌చంద్రారెడ్డి, సురేఖారాణి, డీఆర్ ఓఎస్‌డీ నాగరాజు, డీజీఎం ఏబీ రాంప్రసాద్‌తోపాటు వివిధ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

# ప్రధాన కూడలిలో మొక్కలు

**పచ్చదనం పెంపుపై మున్సిపల్ అధికారుల దృష్టి**



**రిపబ్లిక్ న్యూస్ నంద్యాల క్రైమ్ ఆగస్టు 14:** పర్యావరణ పరిరక్షణ, పట్టణంలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా నంద్యాల పట్టణంలోని ప్రధాన కూడలిలో మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు.మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణంలో పచ్చదనం పెంచేందుకు విస్తృతంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

# మోడల్ స్కూల్, అవుకులో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం




**అవుకు ఆగస్టు 14 రిపబ్లిక్ న్యూస్**

అవుకు స్థానిక ఆదర్శ మోడల్ స్కూల్‌లో ఫిజిక్స్ సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం చేపడుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హేమీమా గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఫిజిక్స్‌లో M.Sc. మరియు B.Ed. అర్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో పాఠశాలకు హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 18-08-2026.

ఎంపికైన గెస్ట్ ఫ్యాకల్టీకి ప్రతి పీరియడ్‌కు 250 చొప్పున గౌరవ వేతనం చెల్లించబడుతుంది. నెలకు గరిష్ఠంగా 48 పీరియడ్లకు 12,000 వరకు చెల్లింపు ఉంటుంది. ఈ అవకాశం ఆగస్టు 2026 నుంచి ఏప్రిల్ 2027 వరకు వర్తిస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత తేదీలోపు పాఠశాలకు హాజరై దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# శ్రావణం తొలి శుక్రవారం అలరించిన రాహుకాల అభిషేకం



**చౌడేపల్లి ప్రతినిధి ఆగస్టు 14 రిపబ్లిక్ న్యూస్**

ప్రముఖ శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా నిర్వహించారు. ముఖ్యంగా ప్రతి వారం నిర్వహించే రాహుకాల అభిషేకం భక్తులను అలరించింది. ఉదయాన్నే అమ్మవారికి వేద పండితులు అర్చకులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం అలంకరణ రావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షం నందు అమ్మవారిని అభిషేకించి ప్రత్యేక అలంకరణల చేశారు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార అర్చక సిబ్బంది భక్తులకు మౌలిక వసతులు సమకూర్చారు పాత కళ్యాణకట్ట నందు భోజన వసతి కల్పించారు.

# అల్మాయిపేట్ గ్రామంలో పట్టపగలే దొంగల బీభత్సం







**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 14** అందోల్ మండలం అల్మయిపేట గ్రామంలో కుమ్మరి వీరమని ఇంటిలో దొంగల బీభత్సం కలకలం లేపింది హైవే 161 జాతీయ రహదారి పక్కన ఉన్న రహదారికి ఆనుకొని కిలోమీటర్ పరిధిలో నాలుగు నుంచి 500 మీటర్ల ప్రాంతంలో గల ఇంటిలో పట్టపగలే ఇంటికి తాళాలు వేసి పొలం పనులకు వెళ్లిన సందర్భంలో ఎవరూ లేని సమయాన్ని చూసి తాళం వేసిన ఇంటికి పట్టపగలే తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాలు పగలగొట్టి చిందర బంధం చేసి మూడు తులాల బంగారం 50 తులాల వెండి నగదు 30000 రూపాయలు డబ్బులు దొంగిలిచ్చినట్టు ఇంటి యజమానురాలు కుమ్మరి వీరమని భర్త విట్టల్ తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్న పోలీసులు







# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !

**న్యూఢిల్లీ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది.




హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

---

## ఇంద్రకీలాద్రిపై శ్రావణ సందడి

**తొలి శుక్రవారంతో భారీగా భక్తుల రాక**

**మరోవైపు వర్షాల కోసం వరుణయాగం ప్రారంభం**



**విజయవాడ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్)::** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస సందడి మొదలైంది. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రికి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో ఆగస్టు 21వ తేదీన వరలక్ష్మీ వ్రతం జరుగనుంది. వరలక్ష్మీ వ్రతం నాడు వరలక్ష్మీదేవిగా దుర్మమ్మ దర్శనమివ్వనున్నారు. అలాగే ఈనెల 27, 28, 29 తేదీలలో పవిత్రోత్సవాలను నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 4వ తేదీన సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరుగనున్నాయి. శ్రావణమాసంలో ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక కుంకుమ పూజలను అర్చకులు నిర్వహించనున్నారు. మరోవైపు, విజయవాడలో వరుణయాగం ఘనంగా ప్రారంభమైంది. వేదపండితులు.. కృష్ణా నదిలోకి దిగి ప్రత్యేక జపాలు చేశారు. ?లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక వరుణ యాగాలు, వరుణ జపాలను నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఉత్తర్వులు మేరకు వరుణ యాగాన్ని చేపట్టారు. ఈ నెల 14 నుంచి 16 వరకు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ?దుర్గాఘాట్, పాత యాగశాలలో 3 రోజుల పాటు విశేష హోమాలు, జపాలు, ఘటాభిషేకాలు జరుగనున్నాయి.

## దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

### పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డేపై మోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు.



సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు ఢిల్లీ హైకోర్టు, విమానాశ్రయానికి బాంబు బెదిరింపులు

**ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**
దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ముంగిట తీవ్ర కలకలం రేగింది. వేడుకలకు ఒక్క రోజు ముందే ఢిల్లీ హైకోర్టుతో పాటు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశాలు రావడం భద్రతా దళాలను తీవ్ర అప్రమత్తం చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో పాటు విమానాశ్రయ అధికారులకు వచ్చిన ఈ బెదిరింపు లేఖలతో పోలీసులు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు వెంటనే రంగంలోకి దిగాయి. హైకోర్టు ఆవరణ, విమానాశ్రయ ప్రాంగణాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తూ సోదాలు చేపట్టాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇప్పటికే రాజధాని వ్యాప్తంగా భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయగా, ఈ బెదిరింపులతో సున్నితమైన ప్రభుత్వ భవనాలు, ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. ముందస్తు జాగ్రత్త




చర్యగా అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో తనిఖీలను తీవ్రతరం చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

## కరూరు తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

**హైకోర్టు తీర్పుపై సుప్రీం స్టే విధింపు**



**న్యూఢిల్లీ,ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):** కరూర్ తొక్కిసలాటలో మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడాన్ని రద్దు చేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు తాజాగా స్టే విధించింది. దీంతో, తమిళనాడు సీఎం విజయ్‌కు స్వల్ప ఊరట లభించినట్లయ్యింది. ఈ కేసులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కే వినోద్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బాధితులకు నగదు రూపంలో సాయం

చేస్తే అభ్యంతరం చెప్పే వారా? అని పిటిషనర్లను ప్రశ్నించింది. కుటుంబంలోని సంపాదన పరుడైన ఒకే ఒక వ్యక్తి మరణిస్తే కుటుంబసభ్యుల్లో ఎవరోకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి అభ్యంతరం చెబుతారా? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించేందుకు మీరెవరు? అని ప్రశ్నించింది. గతేడాది టీవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో తొక్కిసలాటలో పలువురు మరణించిన విషయం తెలిసిందే. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీవీకే అధినేత విజయ్ మృతుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ జీవో జారీ చేశారు. అయితే, ఈ జీవోను జులై 27న హైకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 14, 15ను ప్రభుత్వ జీవో ఉల్లంఘిస్తోందని అభిప్రాయపడింది. ప్రతి ప్రభుత్వ విభాగంలో కారుణ్య నియామకాలు ఆశిస్తున్న వారు ఎందరో ఉంటారని ఈ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది. వారి అవసరాలను పక్కన పెట్టి కరూర్ తొక్కిసలాట బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు ముందుగా ఇవ్వడం సబబు కాదని పేర్కొంది. ఆర్టికల్ 162 ప్రకారం ఈ జీఓ జారీ చేశామన్న ప్రభుత్వ వాదనను సైతం కోర్టు తోసిపుచ్చింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అధికారాలు వినియోగించాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రభుత్వ తప్పిదాలు ఉండే అవకాశం ఉన్నప్పటికీ బాధితులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వని విషయాన్ని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కేసులో కారుణ్య నియామకాలకు అనుమతిస్తే ఒక ప్రమాదకరమైన ఒరవడికి నాంది పలికినట్టు అవుతుందని హైకోర్టు అప్పట్లో పేర్కొంది.

# రాయికల్ ఆటో ట్రాలీ టాటా ఏసీ డ్రైవర్ల కార్మిక సంఘా నాయకుడిగా ఎండి నజీర్

**రాయికల్ మండలం ఆగష్టు,14( రిపబ్లిక్ న్యూస్)**





జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ఆటో ట్రాలీ టాటా ఏసీ డ్రైవర్ కార్మిక యూనియన్ సంఘం కొత్తగా నియామకం ఇట్టి కార్యక్రమంలో 60 మంది సభ్యులు కలిసి అధ్యక్షులుగా ఎండి నజీర్, ఉపాధ్యక్షుడిగా చాంద్ పాషా, క్యాషియర్ దండగుల అశోక్, కార్యదర్శి ఊరేడి రాజేష్, ప్రచార కార్యదర్శి సిరాజ్, వ్యవస్థాపద్యక్షులు కురుశంగా రాజు, కార్యవర్గ సభ్యులు మహేందర్, శేఖర్, శ్రీధర్, చవన్ శ్రీనివాస్, ఇట్టి కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు 60 మంది కలిసి వీరిని ఎన్నుకోవడం జరిగింది

# హర్ గర్ పర్ తిరంగా రాయికల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం




**రాయికల్ మండలం ఆగష్టు14( రిపబ్లిక్ న్యూస్)**భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రజలందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రజలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్, వైస్ చైర్మన్ తురగ సౌజన్య,శ్రీధర్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ మనోహర్,పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గంప ఆనందం,మున్సిపల్ కౌన్సిలర్లు,ఆర్యవైశ్య సంఘం సభ్యులు,లయన్స్ క్లబ్ సభ్యులు, మైనార్టీ సోదరులు, నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నామస్మరణతోనే దేశానికి, ధర్మానికి శ్రీరామ రక్ష...

### రామాజీపేట్ సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉపసర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి...

**రాయికల్ మండలం ఆగష్టు,14( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేట్‌లో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి 70వ తిరునక్షత్ర మహోత్సవాల సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యంలో శ్రీరామ హృదయ కలశ యాత్రశ్రీరామ పాదయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్, వికాస తరంగిణి బాధ్యులు వేల్పుల స్వామి యాదవ్‌లు శ్రీరామ కలశం, చిన్నజీయర్ స్వామివారి చిత్రపటాన్ని సర్పంచ్ బెజ్జంకి మోహన్, ఉపసర్పంచ్ ఇద్దం సుధీర్ రెడ్డి, శ్రీరామాలయ చైర్మన్ కోల రాజు, మాజీ ఎంపీటీసీ, బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల మహేష్‌లకు అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీరామాలయం వరకు "జై శ్రీరామ్" నినాదాలతో భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ నామస్మరణతోనే దేశానికి, ధర్మానికి రక్షణ లభిస్తుందని, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. లోకకల్యాణం, దేశానికిధర్మానికి రక్షణ, ధర్మపాలకుల పరిరక్షణ, ధర్మస్థాపన జరగాలని శ్రీరాముడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతి మల్లారెడ్డి, కందుల రాజేందర్, ప్రెస్ క్లబ్, వికాస తరంగిణి బాధ్యులు గన్నవరం గంగాధర్, ఆకుల సత్యం, బొమ్మకంటి లక్ష్మీనారాయణ, జకిలేటి రాజు, మ్యాకల గంగన్న, తెనుగు ఎర్రన్న, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోని గ్రామ వార్డు సభ్యులకు ప్రోటోకాల్ .గౌరవ వేతనం ఇవ్వాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరిన

### -మైతాపూర్ వార్డు సభ్యులు గంగా మల్లయ్య అనుమల్ల రమ సత్యనారాయణ

**రాయికల్ మండలంఆగస్టు14 ( రిపబ్లిక్ న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని గత సంవత్సరం డిసెంబర్ లో జరిగిన గ్రామ పంచాయతీ సర్పంచుల వార్డు సభ్యుల ఎన్నికలు జరిపి రాష్ట్రంలో పన్నెండు వేల పైన ఉన్నటువంటి గ్రామ పంచాయతీ లలో సర్పంచులు ఉపసర్పంచ్ వార్డు సభ్యులు పదవుల లో ఎవరికీ వారు పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి తిరిగి ప్రతీ ఇంటికి మరియు అక్కడి ఏరియాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు సభ్యుల ను మరియు వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని గ్రామాల్లో ఎక్కువగా ఆయనకు మరియు ఆయనకు మద్దతుగా సూచించిన సర్పంచి అభ్యర్థుల కు వారి యొక్క అమూల్యమైన ఓటు వేసి గెలిపించారు. కానీ కొన్నిచోట్ల అసలు గెలిచిన తరువాత గెలిపించిన ఓటర్ల నుగెలిచిన వార్డు సభ్యుల ను ఏ మాత్రం సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీ లో కేవలం నెల నెలా జరిగే సమావేశానికి ఆహ్వానించి సంతకాలు సేకరించే వరకు వారిని ఆహ్వానించి తరువాత ఏ మాత్రం కూడా ఎలాంటి సందర్భంగా గ్రామ స్థాయిలో జరుగుతున్న ఈతర సమయంలో ఎలాంటి సమావేశాలు నిర్వహించి న కూడ దానికి సంబంధించిన మండల స్థాయి అధికారులు హాజరైన కూడ కనీస సమాచారం కూడా అందించడం లేదని మహితాపూర్ గ్రామ పంచాయతీ ఎనిమిదో వార్డు సభ్యులు బుస గంగా మల్లయ్య అనుమల్ల రమ సత్యనారాయణ తెలిపారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోనున్న తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు.

**రైల్వే కోడూరు ఆగస్టు 14 రిపబ్లిక్ న్యూస్.**



మండల కేంద్రం ఓబులవారిపల్లెలో తాసిల్దార్ గా పనిచేస్తున్న ఆకుల సిద్దేశ్వర రావు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకొనున్నారు ఈ ప్రశంసా పత్రం ఆయనకు అతి తక్కువ రెండు నెలల పైచిలుకు కాలంలో తాసిల్దార్ గా చార్జి తీసుకొని రైతులకు ప్రజలకు మంచి సేవలో అందించడంతో పాటు పై అధికారులు తన తోటి అధికారులతో అన్యోన్యంగావ్యవహరిస్తూ మంచి పరిపాలన అందించడంతో జిల్లా కలెక్టర్ ఆయన సేవలను గుర్తించి ప్రశంస పత్రం ఆగస్టు 15వ తారీఖున ఈ పురస్కారం ఆయనకు ఇవ్వనున్నారు.

# ఆలుర్ లో పది లక్షలతో నిర్మించిన మహిళా సంఘ భవనం ప్రారంభించి, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్ మండలం ఆగస్టు,14( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో 10 లక్షల నిధులతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ .గ్రామంలో ప్లాస్టిక్ నియంత్రణ కార్యక్రమం లో భాగంగా స్టీల్ బ్యాంక్ ను ప్రారంభించారు

అలాగే తట్లవాయ రామచంద్రం గారి భార్య అమృత మరణించగా వారి కుటుంబ సభ్యులను అలాగే రాయికల్ మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్ అత్తమ్మ సురేందర్ నాయక్ తల్లి చిలకమ్మా ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ చిరంజీవి,ఎంపీవో సుష్మ,సర్పంచ్ స్వామి ఉప సర్పంచ్ మహేష్, పాక్స్ చైర్మెన్ ధీటి రాజిరెడ్డి,

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు మాజీ సర్పంచ్ లు భాస్కర్ రావు ,రామ్ రెడ్డి ,రాజనగర్ సర్పంచ్ రాజేష్, డిఈ,మిలింద్, లాల్చావులరాజన్న ,మహిళ సమాఖ్య సభ్యులు,మండల గ్రామ నాయకులు,అధికారులు ,తదితరులు పాల్గొన్నారు అలాగే రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన నల్ల సయమ్మ రామయ్య ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం హాజరై చీర కానుక అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలువురికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని అలాగే ఎవరైనా స్థలము ఉండి ఇల్లు కట్టుకునే స్థితిలో ఉంటే మాకు తెలుపాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు వీరి వెంట నాయకులు మండల నాయకులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు

## బలవంతులకు కాదు... సామాన్యులకు కూడ రాజకీయాల్లో అవకాశం ఇవ్వండి

### రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో లో మహ్మద్ సాధిఖ్ కు అవకాశం ఇవ్వండి., -అదిష్టాననానికి అప్పీల్.,

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇన్చార్జి ఆగస్టు 14**



నేటి రాజకీయాలు బలవంతులకు, ధనవంతులకు, రియల్ స్టేట్ వ్యారస్థులకు,పలుకుబడి,ఒక సామాజిక వర్గం వారికీ , దగ్గరి చుట్టం అయ్యాయి.,సామాన్యులకు, ధనం, డబ్బు, పలుకుబడి,లేని వారికీ నేటి రాజకీయాలు దూరపు చుట్టం తో బాటు అందని ద్రాక్ష లాంటి గా మారాయని, రాజకీయాల్లో గ్రాండ్ ఫాదర్ సహాయం లేనిది జరగని పని బి ఆర్ ఎస్ రాష్ట్ర మైనారిటీ నేత మహ్మద్ సాధిఖ్ ఒక ప్రకటనలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా, హైదరాబాద్, రంగా రెడ్డి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోతున్న సందర్భంగా బి ఆర్ ఎస్ తరపునుంచి తన పేరు ను పరిశీలించాలని అది ష్టణానికి అప్పీల్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్సీ వాణి దేవి పదవి 2027 మార్చి తో ముగియనుంది, అందుకు ఎమ్మెల్సీ ఎన్నిక జరగబోతుంది అని సాధిఖ్ అన్నారు. నేను గత 45 సంవత్సరాల క్రితం గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను, బి. ఏ., బి. ఎడ్., ఉన్నత విద్యను పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగి గా రిటైర్ అయ్యి, నా వయస్సు 70 కి దగ్గర ఉందని పేర్కొన్నారు. నాకు రాజకీయాలు అంటే అమితమైన ప్రేమ, ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ గా నేతగా ప్రతి నిత్యం ప్రజా సమస్యల పై గళం విప్పుతూ, ప్రసార మధ్యమాల ద్వారా, పత్రికల ద్వారా, అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తి చూపుతూ, ఇటు పార్టీ కు అటు సమస్య ల పై నిత్యం పోరాటం చేస్తున్నాను అని గుర్తు చేశారు. ప్రజా సమస్యలు, నిరుద్యోగుల సమస్య లు, ఉద్యోగస్తుల సమస్యలు, అన్నింటి పై అవగాహన కల్గిన రాజకీయ నేతగ నేను ప్రజా జీవితం లో వున్నానని సాధిఖ్ గుర్తు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ధనవంతులకు, రియల్ స్టేట్ వ్యాపారస్థులకు, ప్యారా చూట్ నేతలకు అవకాశం ఇస్తుంది అని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ ఒక ఉద్యమ పార్టీ అని సామాజిక, బడుగు బలహీన వర్గాలకు, అన్ని వర్గాలకు సమానంగా చూసే గంగా జమున తహజీబ్ కల్గిన పార్టీ పై నేను ఒక మైనారిటీ ముస్లిం వర్గానికి చెందిన నేతగా నాకు ఎమ్మెల్సీ గా పోటీ చేయడానికి అవకాశం ఇస్తే, నా షాయ శక్తుల కృషి చేసి, గ్రాడ్యుయేట్ ఓటర్లకు సహాయం గా ఉంటానని అన్నారు. నా కుటుంబం లోనే దాదాపు గా పది మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు వున్నారని అన్నారు. బలవంతులకు కాకుండా, డబ్బు వున్నా వారికీ కాకుండా, ఒక సామాన్య కార్యకర్తలకు, నేతలకు, కూడ అవకాశాలు ఇచ్చే సాంప్రదాయం తేవాలని సాధిఖ్ కోరారు.

# ఘనంగా ధ్వజారెడ్డి పుట్టినరోజు వేడుకలు




**రైల్వే కోడూరు ఆగస్టు 14 రిపబ్లిక్ న్యూస్.**




అంగ రంగ వైభవంగా వైఎస్ఆర్సిపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రైల్వే కోడూరు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి పూజా రెడ్డి పుట్టినరోజు వేడుకలు అభిమానులు కార్యకర్తలు నాయకులు మధ్య శుక్రవారం వైభవంగా జరిగినవి మండల కేంద్రం రైల్వే కోడూరు సిద్దేశ్వర కన్వెన్షన్ హాల్ లో ఈ వేడుకలు జరిగాయి గజమాలతో ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు నాయకులు కార్యకర్తలు తెలియజేశారు నాయకులు కార్యకర్తలు అభిమానులు శాలువులు బొకేలతో కోలాహలంగా పాటలతో వైఎస్ఆర్, జిందాబాద్ ధ్వజన్న ధ్వజన్న జిందాబాద్ అంటూ నినాదాలతో ఫంక్షన్ హాల్ హోరెత్తినది ఆయనకు కులమతాలకు అతీతంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు ఇంతింతై ఓటుడంతై అన్నట్లు మంచితనంలోనూ అభిమానంలోనూ రాజకీయంగాను ఆయన ఉన్నత శిఖరాలు అందుకోవాలని నాయకులు అభిమానులు కార్యకర్తలు నినాదాలతో అభిమానాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బాబుల్ రెడ్డి, ఓబులవారిపల్లి మాజీ సర్పంచ్ గంగన్న గారి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైఎస్ఆర్సిపి రాయలసీమ బూత్ కమిటీ కన్వీనర్ తల్లిని భరత్ కుమార్ రెడ్డి, బాల్రెడ్డిపల్లి బాపురెడ్డి మధుసూదన్ రెడ్డి మైనార్టీ నాయకుడు రఫీ, ఆయన అభిమానులు గౌతమ్ రెడ్డి, గిరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

## స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని

# పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం



**రైల్వే కోడూరు ఆగస్టు 14 రిపబ్లిక్ న్యూస్.**

80 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని

ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెట్లు నాటే కార్యక్రమాన్ని ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ఆధ్వర్యంలో వినతి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి యువ నాయకుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి మండల అభివృద్ధి అధికారి ఎన్ వి ఎన్ రాజేంద్ర పాల్గొన్నారు, ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో చెట్లు నాటి పర్యావరణాన్ని పెంపొందించడానికి చెట్లు దోహదపడతాయని పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆహ్లాదకరంగా మంచి వాతావరణం ఏర్పడుతుందని ఆయన అన్నారుముక్కావారిపల్లి గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో రేపు ఆగస్టు 15 నాడు జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం లక్ష్యంగా పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటడం జరిగినది,ఉపాధ్యాయులు మరియు చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడంతో పాటు, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ,పాఠశాల పరిసరాలు, గ్రామ ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడేలా ప్రజలు, విద్యార్థులు, యువత కలిసి పనిచేయాలని పేర్కొన్నారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తితో పాటు ప్రకృతి పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నేడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ముందుగా పిల్లలచే ఇటువంటి కార్యక్రమాలు చేయించడం ఆనందంగా ఉందని.. మన స్వాతంత్రం ఎందరో వీరుల త్యాగ ఫలితం. మన దేశాన్ని,



మనం పుట్టిన గడ్డని, మన తల్లిని, మన సంస్కృతిని గౌరవించడమే వారికి మనం అందించే నిజమైన గౌరవం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం

. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

. వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్. -. ప్రారంభించిన ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ

. నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు, పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల స్క్రీనింగ్ తో 2500 విలువగల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు

**నంద్యాల ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్) :**
పద్మావతి నగర్ మెయిన్ రోడ్ లో స్టేడియం దగ్గరలో ఉన్న సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి లో శుక్రవారం నుండి ఆదివారం వరకు దేశ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత నవజాత శిశువులు,చిన్న పిల్లల వైద్య శిబిరం శుక్రవారం ప్రారంభించారు. సూర్యన్ ఆసుపత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్ లు ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నయన్ బాబా,డాక్టర్ సునీత్ మాట్లాడుతూ నవజాత శిశువులకు వినికిడి పరీక్షలు,పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల స్క్రీనింగ్ ఉచితంగా చేస్తున్నామని,చిన్నపిల్లల్లో త్వరితగతిన వినికిడి లోపం గుర్తిస్తే సరిచేయడానికి ఆస్కారం ఉంటుందని, అదేవిధంగా గుండె జబ్బులు ఉన్నట్లయితే సరైన సమయంలో ధైర్యాన్ని చికిత్స ద్వారా వారు ఆరోగ్యంగా ఎదగడానికి దోహదపడుతుందని అన్నారు. 2500 విలువగల పరీక్షలు ప్రతి శిశువుకు చేస్తున్నామని తెలిపారు. ప్రతి శిశువు ఆరోగ్యంగా




ఎదగాలన్నదే మా ఆశయమని తెలిపారు.ఆదివారం సాయంత్రం వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని నంద్యాల జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన రావు మాట్లాడుతూ సూర్యన్ చిన్నపిల్లల ఆసుపత్రి లో నవజాత శిశువులు, చిన్నపిల్లల కోసం మూడు రోజులపాటు దేశ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం, ఖరీదైన పరీక్షలు ఉచితంగా చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నయన్ బాబా, డాక్టర్ సునీత్, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ నాగమణి ,డాక్టర్ మణిదీప్ ,ఆసుపత్రి డైరెక్టర్లు నాగ కుమార్, సుధాకర్ ,ఆసుపత్రి సిబ్బంది,శిబిరంలో చూపించుకోవడానికి శిశువులను తీసుకొచ్చిన తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పారా సైక్లింగ్ విజేత అర్షద్ కు మైనారిటీ మంత్రి ఫరూక్ అభినందన

## నేడు గవర్నర్ అట్ హోమ్ కార్యక్రమానికి అర్షద్ కు ఆహ్వానం





**అమరావతి, ఆగస్టు14( రిపబ్లిక్ న్యూస్) :**
డెన్మార్క్ లో జరిగిన గ్రాండ్ పిక్స్ పారా క్రీడా పోటీల్లో భారత్ తరపున పాల్గొని సత్తా చాటిన క్రీడాకారుడు షేక్ అర్షద్(నంద్యాల)ను మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అభినందించారు. పారా క్రీడా వేదికలో సైక్లింగ్ విభాగంలో రెండు బంగారు, మూడు వెండి, ఒక కాంస్యం తో మొత్తం 6 పతకాలు సాధించడం రాష్ట్రానికి గర్వించదగ్గ విషయమని శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో వివిధ పారా క్రీడా పోటీలు, పారా ఒలంపిక్స్ పోటీలలో నంద్యాల కు చెందిన షేక్ అర్షద్ పాల్గొని పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నారు. 2024 లో ఫ్రాన్స్ రాజధాని పారిస్ లో జరిగిన పారాలింపిక్ గేమ్స్ లో భారత్ తరపున పాల్గొన్న ప్రథమ పారా సైక్లిస్ట్ గా అర్షద్ అందరికీ సుపరిచితుడే. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఏపీ ప్రభుత్వం నిర్వహించిన మైనారిటీల సంక్షేమ దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా షేక్ అర్షద్ ను మౌలానా ఆజాద్ మెమోరియల్ బెస్ట్ స్పోర్ట్స్ పర్సన్ అవార్డు తో సన్మానించడం, మరియు ఆ సందర్భంలో గ్రూప్ -2 ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. ఇటీవల డెన్మార్క్ లో జరిగిన పోటీల్లో 6 పతకాలు సాధించి తన క్రీడా ప్రతిభాపాటవాలతో అర్షద్ మరోసారి సత్తా చాటడం నంద్యాల ఖ్యాతి మరియు మన రాష్ట్ర ఖ్యాతి మరోసారి మార్మోగిందని మంత్రి అభినందించారు. కాగా ఆగస్టు 15 స్వాతంత్రం దినోత్సవం రోజున లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ నిర్వహించే అట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితునిగా షేక్ అర్షద్ కు ఆహ్వానం అందింది

# డిసిప్లినరీ కేసులు, ప్రెసిడెన్షియల్ ఆర్డర్, నూతన జాబ్ క్యాలెండర్‌పై సమీక్షించిన సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్ఎస్ రావత్

## సమీక్షకు హాజరైన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

**నంద్యాల బ్యూరో, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలోని డిసిప్లినరీ కేసులు, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలు, నూతన జాబ్ క్యాలెండర్‌కు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో తో కలిసి సాధారణ పరిపాలన శాఖ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్ సమీక్షించగా జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా, డి ఆర్ ఓ రాము నాయక్, కలెక్టరేట్ ఎ ఓ సుభాకర్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న డిసిప్లినరీ కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన




పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రెసిడెన్షియల్ ఆర్డర్ అమలులో భాగంగా స్థానిక అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాల్లో కల్పించాల్సిన ప్రాధాన్యత, జోనల్ విధానం తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. నూతన జాబ్ క్యాలెండర్ కు సంబంధించి జిల్లాల వారీగా ఖాళీ పోస్టుల వివరాలు, శాఖల వారీగా భర్తీ చేయాల్సిన పోస్టులు, నియామక ప్రక్రియకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. ఖాళీల వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి, నియామక ప్రక్రియను నిర్ణీత కాల పరిమితిలో పూర్తి చేయాలని తెలిపారు.

# 15 గొర్రెల దొంగలు అరెస్టు

**రిపబ్లిక్ న్యూస్ నంద్యాల క్రైమ్ ఆగస్టు 14:**
మహానంది మండలం ఆర్ఎస్ గాజులపల్లి పొలిమేరలో 15 గొర్రెల దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1.50 లక్షల విలువైన 15 గొర్రెలు, ఒక స్కార్పియో కారు, వైర్ కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.



ఈ ఘటనపై మహానంది పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు నంద్యాల సబ్‌డివిజన్ అధికారి సుస్మిత ఆర్., ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసులు విశ్వసనీయ సమాచారంతో నంద్యాల మండలం చాపిరేవుల ఫ్లైఓవర్ సమీపంలో ముగ్గురిని అరెస్టు చేశారు.అరెస్టైన వారిలో రామవత్ ధర్మా నాయక్ (42), జయంపు మహేష్ (23), తోట కొత్తూరయ్య (27) ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం






**రిపబ్లిక్ న్యూస్ నంద్యాల క్రైమ్ ఆగస్టు 14:**
నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పోలీస్ కవాతు రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు.పోలీస్, రిజర్వ్, సివిల్ పోలీసులు, హోంగార్డులు, ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులు, పోలీస్ బ్యాండ్ బృందాలు రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. పోలీస్ జాగిలాలు హోని, మార్షల్ చేసిన విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వేడుకలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. వివిధ శకటాల ప్రదర్శన, పోలీస్ కవాతు, జాగిలాల విన్యాసాలు ఆకట్టుకోనున్నాయి.కార్యక్రమంలో ఏఎస్పీ సుస్మిత, అదనపు ఎస్పీ ఎస్. ఖాదర్ బాషా, ఏఆర్ అదనపు ఎస్పీ చిన్నికృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశభక్తి స్ఫూర్తిని చాటిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ

జాతీయ స్ఫూర్తితో మార్మోగిన నంద్యాల పట్టణ వీధులు -జాతీయ జెండాలతో కదం తొక్కిన నంద్యాల ప్రజలు

తిరంగామయమైన నంద్యాల.. దేశభక్తితో ఉప్పొంగిన జనసందోహం- 'జై హింద్', 'భారత్ మాతాకీ జై' నినాదాలతో మార్మోగిన నంద్యాల





**నంద్యాల బ్యూరో, ఆగస్టు 14 (రిపబ్లిక్ న్యూస్):**
దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సార్వభౌమత్వ స్ఫూర్తిని చాటుతూ శుక్రవారం నంద్యాల పట్టణంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీకి విశేష స్పందన లభించింది. జాతీయ జెండాలను చేతబూని, దేశభక్తి నినాదాలు చేస్తూ భారీ సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనడంతో నంద్యాల పట్టణ వీధులు జాతీయ స్ఫూర్తితో మార్మోగాయి. రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ర్యాలీని టెక్కె మార్కెట్ యార్డ్ నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం గాంధీ చౌక్ నుంచి తిరిగి మార్కెట్ యార్డ్‌కు చేరుకుంది. 'జై హింద్', 'భారత్ మాతాకీ జై' నినాదాలతో ర్యాలీ సాగుతుండగా పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది.

**దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్**

ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశభక్తి స్ఫూర్తిని ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. జాతీయ పతాకం దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తుందని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను




సాధించేందుకు సమష్టి కృషి అవసరమని అన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి అత్యంత గర్వకారణమైన రోజని, స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత మంచి నడవడిక, పట్టుదల, విద్యతో ఉన్నత లక్ష్యాలను సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మహాత్మా గాంధీతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు.

**జాతీయ భావాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి : కలెక్టర్ జి. రాజకుమారి**

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులకు, జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. నంద్యాలలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ ప్రజల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశం పట్ల బాధ్యతాభావాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి మనస్సులో దేశాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పం ఉండాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ కోరారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలంగా లభించిన స్వేచ్ఛ విలువను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత విద్యతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణ, పట్టుదల, జాతీయ సమైక్యతా భావంతో ముందుకు సాగాలని సూచించారు.

**మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ**

ర్యాలీ ప్రారంభానికి ముందు 'నశా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు, యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశ సమైక్యత, సార్వభౌమత్వం, జాతీయ ఐక్యతను ప్రతిబింబిస్తూ నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నంద్యాలలో దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ ఘనంగా, విజయవంతంగా కొనసాగింది.

# స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట భద్రత

## పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 14)**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఉదయం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ రిహార్సల్స్‌ను అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్ పరిశీలించారు.ఈ సందర్భంగా హుస్సేన్ పీరా మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు నిఘాను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పరేడ్ రిహార్సల్స్‌లో హోంగార్డు డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సివిల్, ఏఆర్ పోలీసు సిబ్బంది, హోంగార్డులు, ఎన్‌సీసీ విద్యార్థులు, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.





printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com